మన ప్రాణాల రక్షణ మన చేతుల్లోనే ఉందని డీటీసీ నిరంజన్ రెడ్డి అన్నారు. మానవ తప్పిదాల వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. 36వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రజ్యోతి డీటీసీతో ముఖాముఖి నిర్వహించింది.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

మన ప్రాణాల రక్షణ.. మన చేతుల్లోనే..!

- మానవ తప్పిదాలవల్లే ఎక్కువ ప్రమాదాలు
- నివారణకు ప్రత్యేక చర్యలు
- డీటీసీ నిరంజన్ రెడ్డి



రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే చాలావరకు ప్రమాదాలు నివారించవచ్చు. ప్రభుత్వం ఏటా జనవరిలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా.. కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ అధికారులతో కలసి వాకథాన్ నిర్వహించి.. రహదారి నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డ్రైవర్లకు, విద్యార్థులకు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అవగాహన కార్యక్రమాలతోపాటు ఉచిత హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం.

మొగిలి ఘాట్‌పై ప్రత్యేక దృష్టి


మొగిలి ఘాట్‌లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రత్యేక దృష్టి పెట్టాం. నివారణ కోసం ఎన్‌హెచ్ అధికారులతో కలసి సూచిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు, ఇసుక డ్రమ్ములు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్నాం. దీనివల్ల చాలావరకు ప్రమాదాలను నివారించగలిగాం.

ద్విచక్రవాహనదారులవే ఎక్కువ ప్రమాదాలు

మూడేళ్లలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సుమారు 350 మంది మరణించారు. ఈ ప్రమాదాల్లో 50 శాతం మంది ద్విచక్రవాహనదారులే మరణించారు. ఇందులోనూ 90 శాతం మంది యువత ఉన్నారు. యువత ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం, మద్యం తాగి నడపడం, అతివేగంగా హెల్మెట్ లేకుండా వెళ్లడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

కండలేరు, గండికోట రిజర్వాయర్ల నుంచి జిల్లాకు నీళ్లు

రూ.8 వేల కోట్లతో రెండు దశల్లో ప్రణాళిక


గండికోట రిజర్వాయర్


కండలేరు జలాశయం

ఇక వాటర్ గ్రిడ్

- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిన ఆర్‌డబ్ల్యూఎస్
- ఫిబ్రవరి 7వ తేదీన ఓపెన్ కానున్న టెండర్

ప్రతి ఇంటికీ మంచి నీటి కొళాయితో పాటు రోజుకు తలసరి 55 లీటర్ల నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా జల్ జీవన్ మిషన్‌ను కేంద్రం అమలు చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం దీన్ని సరిగా అమలు చేయలేకపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం జల్‌జీవన్ పథకానికి జీవం పోసేలా చర్యలు తీసుకుంటోంది. ప్రారంభం కాని పనుల్ని రద్దు చేసి కొత్త ప్రతిపాదనలతో పనుల్ని చేపట్టనుంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పదేళ్లక్రితం ప్లాన్ చేసినా....

వంద ట్యాంకర్లతో నీళ్లను సరఫరా చేసినా ప్రజల అవసరాలు ఏ మాత్రం తీరేవి కావు. ఈ గండం నుంచి గట్టెక్కించాలనే ఉద్దేశంతో 2014-19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఈ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రూ.4375 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తయిన తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. వెంటనే పనుల్ని రద్దు చేసి, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికే పథకాన్ని పరిమితం చేసింది. 2022 చివరి నాటికి దీన్ని పూర్తి చేస్తామని ప్రకటించినా, సాధ్యం కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. దీనికి సంబంధించిన డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇటీవల తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు.

జల్‌జీవన్ మిషన్ పనుల ఆపివేత

జిల్లాలో 3,17,818 ఇళ్లుండగా.. 2,67,272 ఇళ్లకు కొళాయి కనెక్షన్లున్నాయి. మిగిలిన 50,546 ఇళ్లకు జల్‌జీవన్ మిషన్ కింద కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసే కార్యక్రమం వైసీపీ హయాంలో ప్రారంభమైంది. అప్పట్లో రూ.431.45 కోట్ల విలువైన 5041 పనులు మంజూరవగా.. రూ.101.20 కోట్ల ఖర్చుతో 2432 పనుల్ని పూర్తి చేయగలిగారు. మిగిలిన పనులతో పాటు ఆ విధానాన్నీ కూటమి ప్రభుత్వం రద్దు చేసేసింది.

గ్రౌండ్ వాటర్‌కు బదులు సర్ఫేస్ వాటర్ విధానం..

వైసీపీ హయాంలో ఆయా గ్రామాల్లో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంకులకు బోర్ల (గ్రౌండ్ వాటర్) ద్వారా నీరందించాలనుకుని పనులు ప్రారంభించగా.. కూటమి ప్రభుత్వం సర్ఫేస్ వాటర్ (రిజర్వాయర్ల నుంచి)ను ఇళ్లకు సరఫరా చేసేందుకు కొత్తగా ప్లాన్ చేసింది. అంతేకాకుండా, కొళాయి కనెక్షన్లు లేని 50 వేల ఇళ్లకే కాకుండా జిల్లాలో 3.17 లక్షల ఇళ్లకూ రిజర్వాయర్ల నీళ్లు వెళ్లేలా కనెక్షన్ ఇవ్వనున్నారు.

31 మండలాలూ కవరయ్యేలా...

నెల్లూరు జిల్లా రాపూరులోని కండలేరు రిజర్వాయర్ నుంచి నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాలకు తాగునీరందించేలా ప్రతిపాదించారు. ఈ నియోజకవర్గాల్లోని 10.17 లక్షలమంది దాహార్తి తీర్చేందుకు 0.85 టీఎంసీలు కేటాయించనున్నారు. అలాగే, కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాలకు నీళ్లను తేనున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లోని 10.95 లక్షల మందికి 0.91 టీఎంసీలు అవసరం. ఆయా రిజర్వాయర్ల నుంచి నేరుగా ఇళ్లకు నీళ్లు రానున్నాయి.

తిరుపతి ఐఐటీ, గుర్రంకొండ వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్లు

కండలేరు నుంచి రానున్న నీళ్లను తిరుపతి ఐఐటీ వద్ద, గండికోట నుంచి రానున్న నీళ్లను గుర్రంకొండ వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధి చేయనున్నారు. ఇక అక్కడి నుంచి నేరుగా ఇళ్లకు పంపించేస్తారు. ఈ డిజైన్‌లో ఎక్కడా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు ఉండవు.

తొలి విడతలో రూ.2,370 కోట్ల కేటాయింపు

కండలేరు, గండికోట నుంచి జిల్లాకు తాగునీటిని తెచ్చేందుకు రూ.8 వేల కోట్లను కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. తొలివిడతలో గండికోట నుంచి మదనపల్లె వరకు నీళ్లను తేనుండగా, దీని కోసం రూ.2,370 కోట్లతో టెండర్లను పిలిచారు. వచ్చే నెల 7వ తేదీన టెండర్ తెరవనున్నారు. రెండో విడతలో కుప్పం వరకు నీళ్లు రానున్నాయి. రెండో దశ పనులపై కూడా త్వరలో దృష్టి పెట్టొచ్చు. 2058వ సంవత్సరం వరకు ఈ కనెక్షన్లు ఉండేలా పనులు చేస్తుండగా.. ఆ తర్వాత కూడా స్వల్ప మరమ్మతులు చేసుకుని కొనసాగించుకోవచ్చని చెబుతున్నారు.

జన నాయకుడు పోర్టల్‌లో మార్పులు

- టెలికాన్ఫరెన్స్‌లో అధికారులనుంచి సూచనల స్వీకరణ


ఈ నెల 7వ తేదీన జన నాయకుడు పోర్టల్ ప్రారంభం సందర్భంగా ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో ఆవిష్కరించిన జన నాయకుడు పోర్టల్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కుప్పం నియోజకవర్గానికే పరిమితమైన ప్రజా వినతుల పరిష్కార వేదిక అయిన ఈ పోర్టల్‌ను అవసరాలకు అనుగుణంగా మలచడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో సీఎంవో నుంచి అందిన ఆదేశాల మేరకు కడా అధికారులు బుధవారం జిల్లా, డివిజనల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల మొదటివారంలో కుప్పం పర్యటనకు వచ్చినప్పుడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జన నాయకుడు పేరుతో పోర్టల్‌ను, ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌ను ప్రారంభించారు. కార్యాలయ ఆవరణలోనే ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అప్పట్నుంచీ టీడీపీ కార్యాలయంలో జన నాయకుడు గ్రీవెన్స్ సెల్ విజయవంతంగా సాగుతోంది. ప్రజలనుంచి వచ్చిన వినతులను స్వీకరించి, ఆన్‌లైన్లో నమోదు చేసి, సంబంధిత ప్రభుత్వ శాఖలకు పరిష్కారంకోసం పంపడంలో చిన్నచిన్న అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రజలనుంచి అందుతున్న కొన్ని సమస్యల పరిష్కారం ఒకేసారి రెండుమూడు ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఉంటోంది. అయితే ఈ వినతులను జన నాయకుడు పోర్టల్‌లో ఏదో ఒక శాఖ కిందనే నమోదు చేస్తున్న సిబ్బంది, ఆ శాఖాధికారులకే దానిని పంపుతున్నారు. ఉదాహరణకు ఒక గ్రామానికి లేదా ప్రదేశానికి రోడ్డు కావాలని ప్రజలనుంచి వినతులు అందాయనుకుంటే జన నాయకుడు పోర్టల్‌నుంచి నేరుగా పంచాయతీరాజ్ శాఖకు పంపుతున్నారు. అక్కడ రోడ్డు నిర్మించడానికి అనువైన స్థలం సేకరించి ఇవ్వాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులకు ఉంటుంది. ఆ తర్వాతే పంచాయతీరాజ్ శాఖ రోడ్డు నిర్మించే అవకాశం ఉంది. అంటే ఇక్కడ రెండు శాఖల సమన్వయంతో జరగాల్సి పనిని కేవలం ఒక శాఖ బాధ్యతగానే నమోదు చేస్తున్నారు. అలాగే తాగునీటి సరఫరాకు సంబంధించిన బోర్లు వేయడం, పైపులైన్లు నిర్మించడం ఆర్‌డబ్ల్యూఎస్ బాధ్యత. కానీ వాటికి మరమ్మతులు అవసరమైనప్పుడు ఆ సమస్యను తీర్చాల్సింది, పంచాయతీరాజ్ శాఖ. అయితే ఈ పైపులైన్ల మరమ్మతులు, బోరు విద్యుత్తు మోటారు మరమ్మతులకోసం వచ్చే వినతులు నేరుగా ఆర్‌డబ్ల్యూఎస్‌కు వెళ్తున్నాయి. పక్కా ఇల్లు కావాలని ప్రజలనుంచి వినతులు వస్తే, ఆ కాలమ్ పోర్టల్‌లో లేకపోవడంవల్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అన్న కాలంలో నమోదు చేస్తున్నారు. తీరా హౌసింగ్ శాఖ అధికారులు, వినతి ఇచ్చిన వారికి ఫోన్ చేశాక సమస్య అది కాదని తేలుతోంది. ఇటువంటి చిన్నచిన్న పొరపాట్లవల్ల ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఆలస్యమవుతోంది. ఇటువంటి పొరపాట్లను, సమస్యలను సీఎంవో గుర్తించింది. ఇలాంటి సమస్యలు భవిష్యత్తులో ఉత్పన్నం కాకుండా, ఆయా శాఖల అధికారులను సమన్వయం చేసుకుని పోర్టల్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా స్వల్ప మార్పులు చేయాలని సీఎంవోనుంచి కడాకు ఆదేశాలు అందాయి. కడా పీడీ వికాస్ మర్మత్ సూచన మేరకు ప్రాజెక్ట్ మేనేజరు ప్రేమ్‌కుమార్, సీఎం పీఏ దుర్గాప్రసాద్‌తో కలిసి బుధవారం ఉదయం జిల్లా, డివిజనల్ ప్రభుత్వ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వారు గుర్తించిన సమస్యలను, అదనంగా చేర్చాల్సిన కాలమ్స్‌ను ఆన్‌లైన్ ద్వారా తమకు పంపాలని వారిద్దరూ అధికారులను కోరారు. జన నాయకుడు పోర్టల్‌లో అవసరాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు జరిగితే ప్రజా సమస్యలు మరింత వేగంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.


వరసిద్ధుడికి గ్రామోత్సవం

వైభవంగా తై అమావాస్య వేడుకలు

ఐరాల(కాణిపాకం), జనవరి 29(ఆంధ్రజ్యోతి):కాణిపాక ఆలయంలో బుధవారం తై అమావాస్య వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రధాన ఆలయంలోని వరసిద్ధుడి మూల విరాట్‌కు ఉభయదారు కాకర్లవారిపల్లెకు చెందిన పట్టాభి నాయుడు ఆధ్వర్యంలో అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను కాణిపాక పురవీధుల్లో ఊరేగించారు.ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌లతో మోసాలు



నగరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):మొబైల్ ఫోన్లకు కొత్త యాప్‌లను పంపి అవతలి వ్యక్తి ఫోన్‌ను పూర్తిగా అదుపులోకి తీసుకొనేందుకు సైబర్ నేరస్తులు తెగబడుతున్నారు.ఆ ఫోన్ ఐఎంఐఈ నెంబరును హ్యాక్ చేసి ఆ ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, ఇతర సమాచారాలు,ఆర్థిక లావాదేవీలు అన్నీ తమకు చేరేలా సైబర్ నేరగాళ్ల ప్లాన్ చేస్తున్నారు.ఇలా చేస్తూ అకౌంట్లలో నగదు నొక్కేసేందుకు ప్రయత్నిస్తున్నారు.20 రోజుల క్రితం నగరిలో ఒకరి సెల్‌ఫోన్‌కు పీఎం కిసాన్ యోజన వివరాలు పొందాలంటే ఈ యాప్‌ను ఓపెన్ చేయండని మెసేజ్ పంపారు.ఆ యాప్‌ను ఓపెన్ చేసిన 15 నిమిషాల్లో ఆ ఫోన్‌లో వున్న అన్ని యాప్‌లకు అదే మెసేజ్‌ను ఆ వ్యక్తి ఫోన్‌ద్వారా పంపినట్లు పంపించారు.మరో అరగంటలో ఆ వ్యక్తి అడ్మిన్‌గా వున్న గ్రూపుల్లో అందరినీ డిలీట్ చేసేశారు.స్నేహితుడి ద్వారా తన ఫోన్ హ్యాక్ అయిందన్న విషయం తెలుసుకుని వెంటనే తన ఫోన్‌పే అకౌంట్‌లో వున్న నగదును ఏటీఎమ్ ద్వారా తీసేశారు.24 గంటల పాటు ఆ ఫోన్‌కు చెందిన వాట్సాప్ పూర్తిగా పనిచేయకుండా ఆపేశారు.రెండు రోజుల క్రితం పుత్తూరుకు చెందిన వ్యక్తి ఫోన్‌కు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేరుతో రూ.1000 కడితే 30 నుంచి 45 నిమిషాల్లో 10000 వస్తుందని, మూడువేలు వేస్తే 18000 వస్తుందని మెసేజ్ పంపారు.ఆ వ్యక్తి ఫోన్‌లో కాంటాక్ట్‌లో వున్న అందరికీ ఆ మెసేజ్‌లు వెళ్లాయి.స్నేహితుల ద్వారా ఆ సమాచారం తెలుసుకున్న ఆ వ్యక్తి నెట్ కనెక్షన్ ఆఫ్ చేసి సిమ్‌కార్డును ఫోన్ నుంచి తొలగించేశారు.వీరిద్దరూ అప్రమత్తంగా వుండి బ్యాంకులో నగదును వెంటనే తీసేసి పోలీసులకు సమాచారం అందించి మోసానికి గురికాకుండా బయటపడగలిగారు.విజయపురం మండలం పాతార్కాడుకు చెందిన ఓ రాజకీయ నాయకుడి ఫోన్‌సైతం ఇదే తీరున హ్యాక్ కావడంతో వెంటనే అన్ని గ్రూపులనుంచి అతని నెంబరును డిలిట్ చేయించుకుని ఒక రోజు పూర్తిగా తన ఫోన్‌ను ఆఫ్ చేసివుంచారు. ఈ విషయమై నగరి సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ గుర్తు తెలియని ఫోన్ నెంబర్లనుంచి యాప్‌లు వచ్చినట్లయితే ఓపెన్ చేయరాదన్నారు.ఏపీకే ఫైల్ అని వున్న యాప్ సైబర్ నేరగాళ్లదని గమనించాలని సూచించారు.

ఐటీఐ పాసైన వారికి పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి శిక్షణ

చిత్తూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో చేరడానికి అర్హత పరీక్ష కోసం బ్రిడ్జి కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి అర్హతగా ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసి 60 శాతం మార్కులతో పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో రెండవ సంవత్సరంలో చేరడానికి నిర్వహించే అర్హత పరీక్షకు బ్రిడ్జి కోర్సులో శిక్షణను ప్రభుత్వ ఐటీఐలో ఇస్తున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఐటీఐ, పదవ తరగతి జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలతో గురువారం నుంచి వచ్చే నెల 5వ తేది లోపు ప్రభుత్వ ఐటీఐలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాల కోసం 77996 79351 నెంబరును సంప్రదించాలని కోరారు.

పోక్సో కేసులో ఇద్దరు యువకులకు రెండేళ్ళ జైలు, జరిమానా

చిత్తూరు లీగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇద్దరు యువకులకు చిత్తూరు న్యాయస్థానం రెండేళ్ళ జైలు శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. మదనపల్లె పట్టణానికి చెందిన ఓ బాలికను మూడేళ్ల క్రితం సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన కోటకొండ చరణ్, తిరుపతికి చెందిన షేక్ హమీద్ కిడ్నాప్ చేశారు.బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు.కేసు దర్యాప్తు చేసిన ఎస్ఐ చంద్రమోహన్ వారిద్దరినీ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై బుధవారం పోక్సో కోర్టులో విచారణ జరిగింది. పూర్వాపరాలు పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.శాంతి ఒక్కొక్కరికీ రెండేళ్ళ జైలుశిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసును ఏపీపీ శైలజ వాదించారు.

31లోపు టీఐఎస్‌లో టీచర్ల వివరాలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి):ఈ నెలాఖరులోపు టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో టీచర్ల సర్వీసు వివరాలు పొందుపరచనున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు.మార్పులు చేర్పులు చేసుకునే వెసులుబాటు లాగిన్‌లో ఉంటుందని తెలిపారు. భవిష్యత్ టీచర్ల ప్రయోజనాలకు, పదోన్నతులకు టీఐఎస్ ప్రామాణికం కానుందని తెలిపారు.

అమర జవాన్ కార్తీక్ కుటుంబానికి రూ.కోటి సాయానికి ప్రభుత్వ అంగీకారం

బంగారుపాళ్యం, జనవరి 29(ఆంధ్రజ్యోతి):జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానుపెంట గ్రామానికి చెందిన కార్తీక్ యాదవ్ కుటుంబానికి రూ.కోటి ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. బుధవారం మొగిలీశ్వరుడి దర్శనానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.కోటితో పాటు ఐదెకరాల భూమి, ఇంటి స్థలానికి సంబంధించిన దస్త్రాలను కార్తీక్ కర్మక్రియల రోజున అందజేయనున్నట్లు తెలిపారు.

కందిపప్పు కొరత రానివ్వం: డీఎం

చిత్తూరు సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి కోటా కింద కందిపప్పు కొరత రానివ్వమని పౌరసరఫరాల సంస్థ డిస్ట్రిక్ మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. జిల్లాలో 1379 చౌకదుకాణాల్లోని 5.36 లక్షల మంది తెలుపురంగు కార్డుదారులకు కందిపప్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఒకటవ తేదీ నాటి నుంచి ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడంలో భాగంగా 14 మండల స్థాయి స్టాక్ పాయింట్ల నుంచి చౌకదుకాణాలకు చేర్చామన్నారు. బియ్యం 8 వేల టన్నులు, చక్కెర 250 టన్నులు కందిపప్పు 504 టన్నులకు గాను ఇప్పటి వరకు 350 టన్నులు సరఫరా చేశామని చెప్పారు. మిగిలిన 154 టన్నుల కందిపప్పును తిరుపతి నుంచి తెప్పించి కొరతగా ఉన్న చౌదుకాణాలకు పంపుతామన్నారు.

ఒంటరి ఏనుగు దాడిలో మహిళకు గాయాలు


యాదమరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు దాడి చేయడంతో ఓ మహిళ కాలు విరిగిందని డీకేచెరువు గ్రామస్థులు తెలిపారు. స్థానికుల కథనం మేరకు.. యాదమరి మండల పరిధిలోని దిగువ కణతలచెరువు గ్రామానికి చెందిన సంపూర్ణ (55) మానసిక స్థితి సరిగా లేని కారణంగా మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని (తమిళనాడు) సరిహద్దు అటవీ ప్రాంతంలోకి వెళ్లగా ఒంటరి ఏనుగు చేసిన దాడిలో కాలు విరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆమెను వెతుక్కుంటూ వెళ్లగా అటవీ ప్రాంతంలో కేకలు విని అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. కంపల్లి బీట్ అటవీశాఖ ఎఫ్‌బీవో సతీష్ సిబ్బంది గాయపడ్డ మహిళను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అటవీశాఖ అధికారి ఎఫ్ఆర్‌వో థామస్ మాట్లాడుతూ తమిళనాడు సరిహద్దు, బోడబండ్ల బీట్‌లో ఒంటరి ఏనుగు సంచరిస్తున్న నేపథ్యంలో రాత్రిపూట అటవీ ప్రాంతంలో ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. బాధిత మహిళ కుటుంబానికి రూ.ఐదు వేల నగదు అందజేశారు.



భరద్వాజతీర్థానికి స్వామి అమ్మవార్ల వేంచేపు

శాస్త్రోక్తంగా తై అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బుధవారం తై అమావాస్య ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠింపజేసి భరద్వాజతీర్థంలోని శివాలయం వద్దకు వేంచేపు చేశారు. అక్కడ స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను తిరిగి ఊరేగింపుగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి తీసుకువచ్చారు. పూజలు నిర్వహించాక ఉత్సవర్లను పట్టణంలో ఊరేగించారు.ఆలయ ఈవో బాపిరెడ్డి, బొజ్జల బృందమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





స్వామి అమ్మవార్లకు నిర్వహిస్తున్న అభిషేకం.. హాజరైన భక్తులు

సర్వదర్శనానికి 5 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 4 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,310

తలనీలాలు సమర్పించినవారు: 17,310



100 షార్ మైలు రాళ్ళు

పులికాట్ సరస్సుకూ, బంగాళాఖాతానికీ నడుమ ఉండే శ్రీహరికోట ఒకప్పుడు చిన్నదీవి. అడవి మీద ఆధారపడి నాగరిక ప్రపంచం ఎరుగని ఏనాదులు ఉండేవారు. వ్యవసాయం చేసుకుంటూ తూర్పు రెడ్లు చిన్న చిన్న ఊళ్లుగా ఉండేవారు. 1970ల నుంచీ ఈ దీవి రూపు రేఖలు మారిపోయాయి. సూళ్లూరుపేట నుంచి పులికాట్‌ను చీలుస్తూ రోడ్డు వేయడంతో ప్రధాన భూభాగంతో కలిసిపోయింది. 1969లో రాకెట్‌ల ప్రయోగానికి అనువైన ప్రదేశం అని శ్రీహరికోటను గుర్తించిన తర్వాత నిర్మాణాలు పెరిగాయి. ప్రయోగాల వేదికగా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. సైకిల్ మీద రాకెట్‌లను మోసుకొచ్చి ప్రయోగించిన దశ నుంచి అంతరిక్షంలో ఏకంగా ఒకశాశ్వత ప్రయోగశాలనే నిర్మించే దిశగా జరుగుతున్న పరిణామాలకు ప్రధాన కేంద్రంగా శ్రీహరికోట మారింది. అవసరాలకు అనుగుణంగా రాకెట్లను రూపొందించుకుంటూ వందవ రాకెట్‌ను బుధవారం నింగిలోకి సగర్వంగా శ్రీహరికోట ఎగరేసింది. ఈ సందర్భంగా వంద రాకెట్ల విశేషాల సమాహారం...

- కథనం - సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)



చిన్న ప్రయోగాలతో ప్రారంభం.. నేడు భారీ ప్రయోగాలు

ఎస్ఎల్వీ-డీ 1తో శ్రీకారం

1979 ఆగస్టు 19న తొలిసారిగా ఎస్ఎల్వీ-డీ1 పేరుతో 40 కిలోల బరువు కలిగిన రోహిణి-1 ఉపగ్రహాన్ని షార్ నుంచి రోదసీలోకి పంపారు. అతి తక్కువ బరువు కలిగిన ఈ ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా ఉన్న లియో అర్బిట్‌లోకి పంపించారు. ఈ సిరీస్‌లో 1983 వరకు ఐదేళ్లలో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. అనంతం 1980 జూలై 18న 35 కిలోల ఆర్ఎస్-1 ఉపగ్రహం, 1981 మే 31న 38 కిలోల బరువుగల ఆర్ఎస్-డీ1 ఉపగ్రహం, 1983 ఏప్రిల్ 17న 41.5 కిలోల బరువు గల ఆర్ఎస్-డీ2 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు.

రెండో రాకెట్... ఏఎస్ఎల్వీ

1987 మార్చి 24న ఏఎస్ఎల్వీ-డీ1 పేరుతో 150 కిలోల బరువు గల స్రాస్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. 100 కిలోల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు రెండో దశలో రూపొందించుకున్న రాకెట్ ఇది. 1987 నుంచి 1994 మధ్యలో ఈ సిరీస్‌లో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. రెండు దశల ఘన ఇంధనం వినియోగించే రాకెట్ ఇది.



ఇస్రో విజయ కెరటం పీఎస్ఎల్వీ

1993 సెప్టెంబరు 20న పీఎస్ఎల్వీ-డీ1 రాకెట్ తొలి ప్రయోగం విఫలమైంది. అయితే 1994 అక్టోబరు 15న 804 కిలోల బరువుతో ఐఆర్ఎస్-పీ2 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఆ తర్వాత ఈ రాకెట్ విజయ రికార్డులను నెలకొల్పుకుంటూ వెళ్తోంది. తక్కువ బరువు కలిగిన విదేశీ ఉపగ్రహాలు కూడా పీఎస్ఎల్వీల ద్వారానే ప్రయోగించారు. చంద్రయాన్-1, ఐఆర్ఎన్ఎస్ వంటి సిరీస్ ప్రయోగాలు దీని ద్వారానే అంతరిక్షంలోకి పంపారు. ఇప్పటి వరకు ఈ సరీస్‌లో 62 ప్రయోగాలు చేపట్టారు. రెండు ప్రయోగాలు మినహా మిగిలినవన్నీ విజయవంతం అయ్యాయి. ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశ పెట్టిన అద్భుత రాకెట్ ఇది.

- 1993 నుంచి 2003 వరకు పదేళ్లలో పీఎస్ఎల్వీ ప్రయోగాలు 8.
- 2004 నుంచి 2014 వరకు 21 ప్రయోగాలు
- 2015 నుంచి 2004 చివరి వరకు 33 ప్రయోగాలు





భవిష్యత్‌లో..

గగన్‌యాన్ మిషన్ ప్రయోగం, చంద్రయాన్-4 వంటి భారీ ప్రయోగాల పై దృష్టిసారించారు. షార్‌లో రెండు ప్రయోగ వేదికలు, నాలుగు అనుసంధాన భవనాలు, ఎంఎస్‌టీ టవర్ వసతులు ఉన్నాయి. మూడో లాంచ్‌ప్యాడ్ అత్యంత అధునాతన వసతులతో నిర్మించేందుకు ఈ ఏడాదే భూమిపూజ చేయనున్నారు. ఈ లాంచ్ ప్యాడ్‌ను రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా నిర్మాణం చేపట్టనున్నారు. దీని ద్వారా ఏకంగా 20 నుంచి 30 టన్నుల బరువు గల భారీ ఉపగ్రహాలను ప్రయోగించవచ్చుని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



భారీ ఉపగ్రహాల కోసం ఎల్‌వీఎం3..

2014 డిసెంబరు 18న తొలిసారిగా ఈ ఎల్‌వీఎం3 ద్వారా క్రూ మాడ్యూల్ రీ ఎంట్రీ విజయవంతంగా చేపట్టారు. అనంతరం 2017 జూలై 5న ఎల్‌వీఎం3-డీ1 ద్వారా జీశాట్-19 కమ్యూనికేషన్ రంగానికి చెందిన ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. 2014 నుంచి 2023 వరకు ఈ సిరీస్‌లో మొత్తం 7 ప్రయోగాలు చేపట్టగా 7 విజయం చెందాయి. ఈ వాహక నౌక ద్వారానే చంద్రయాన్-1, చంద్రయాన్-3 ఉపగ్రహాలు పంపారు. నాలుగు నుంచి 5 టన్నుల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు ఎల్‌వీఎం3 వాహక నౌక రూపొందించారు.



కమ్యూనికేషన్ కోసం జీఎస్ఎల్వీ

2001లో ఏప్రిల్ 18న జీఎస్ఎల్వీ-డీ1 రాకెట్ ద్వారా 2 వేల కిలోల బరువు కలిగిన జీశాట్-1 ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. అత్యంత బరువు గల కమ్యూనికేషన్ ఉపగ్రహాలను పంపేందుకు ఇస్రో ఈ రాకెట్‌కు రూపకల్పన చేసింది. ఈ రాకెట్‌లో క్రయోజనిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తొలుత రష్యా నుంచి పొందినా, తర్వాత పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే వీటిని ప్రయోగిస్తున్నారు. ఈ సిరీస్‌లో మొత్తం 17 ప్రయోగాలు చేపట్టగా నాలుగు మాత్రమే విఫలం చెందాయి.



బుల్లి వాటి కోసం ఎస్ఎస్ఎల్వీ

2022 ఆగస్టు-07న ఎస్ఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ఈవోఎస్-02 ఉపగ్రహం పంపారు. ఇవి విఫలం చెందింది. అనంతరం వివిధ పరీక్షలు నిర్వహించి తిరిగి 2023 ఫిబ్రవరి 10న ఈవోఎస్07 ఉపగ్రహాన్ని ఇదే రాకెట్ ద్వారా పంపి విజయం సాధించారు. అనంతరం 2024 ఆగస్టు 16న ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం చేపట్టారు. ఈ సిరీస్‌లో మొత్తం మూడు ప్రయోగాలు చేపట్టారు. తక్కువ బరువు గల ఉపగ్రహాలను రోదసీలోకి పంపేదుకు ఇస్రో ఎస్ఎస్ఎల్వీని అందుబాటులోకి తెచ్చింది.





డివైడర్‌పైకి ఎక్కిన బస్సు- మృతిచెందిన మురళి

తండ్రి కర్మక్రియల నాడే..

- బస్సు ఢీకొని కుమారుడి దుర్మరణం -

దొరవారిసత్రం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తండ్రి కర్మక్రియలరోజే బస్ ఢీకొని ప్రాణాలు కోల్పోయాడో వ్యక్తి. పోలీసుల కథనం ప్రకారం.. దొరవారిసత్రం మండలం నెలబల్లికి చెందిన చిట్టిబోయిన మురళి(49) వ్యవసాయం చేస్తుంటాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదిరోజుల క్రితం ఇతని తండ్రి సుబ్బరామయ్య చనిపోయారు. పెద్ద కుమారుడిగా మురళి తన తండ్రి కర్మక్రియలను బుధవారం నిర్వహించారు. అవి ముగిశాక రాత్రి పనిమీద బైకుపై బయటకు వెళ్తున్నారు. హైవే కూడలి వద్ద ఇతడి వాహనాన్ని అపాచీ కార్మికులను తీసుకువెళ్తున్న ట్రావెల్ బస్ ఢీకొని డివైడర్‌పైకి ఎక్కేసింది. దీంతో మురళి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వెంటనే స్థానికులు బస్సును చుట్టుముట్టారు. ఎస్ఐ అజయ్‌కుమార్ అక్కడికి వెళ్లి కార్మికులను మరో బస్సులో పంపించారు. అనంతరం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్మక్రియలు చేసిన ఇంట్లో కొన్ని గంటలు కూడా ముగియకుండానే మరొకరు చనిపోవడంతో విషాద వాతావరణం నెలకొంది. పదిరోజుల వ్యవధిలో తండ్రీకొడుకులు మరణించడాన్ని కుటుంబ సభ్యులు తట్టుకోలేకపోతున్నారు. పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశారు.







మృతి చెందిన గణేష్, లక్ష్మీనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

పిచ్చాటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రెప్పాలపట్టు అటవీమార్గంలో తులసికృష్ణాపురం క్రాస్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. శ్రీకాళహస్తి మండలానికి చెందిన గణేష్(25), మిట్టకండ్రిగకు చెందిన చెర్లోపల్లి లక్ష్మీనారాయణ(30) ద్విచక్రవాహనంలో పిచ్చాటూరుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో తులసికృష్ణాపురం క్రాస్ వద్ద వీరి బైక్‌ను కారు ఢీకొంది. సంఘటనా స్థలంలోనే వీరిద్దరూ దుర్మరణం చెందారు. కారు డ్రైవర్ పరారయ్యాడు. సమీపంలోని పశువుల కాపర్లు ప్రమాద విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటేశ్వరులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గణేష్‌కు పెళ్లి కాలేదు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

భూమి ఆన్‌లైన్ చేయలేదంటూ ఆత్మహత్య బెదిరింపు

- ఇద్దరు యువకులపై కేసు నమోదు

డక్కిలి, జనవరి 29 : (ఆన్‌లైన్) : తాము ఆక్రమించుకున్న భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని ఇద్దరు ఇద్దరు అన్నదమ్ములు పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు చేసిన యత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్న వైనమిది. దగ్గవోలుకు చెందిన దామిశెట్టి రవికుమార్, చంద్రశేఖర్‌లు తండ్రి క్రిష్ణయ్యతో కలిసి బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తాము సాగు చేసుకొంటున్న భూములను ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు చేయడం లేదంటూ డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. తహసీల్దార్ రాగానే సమస్యను ఆయనకు నివేదిస్తానని డిప్యూటీ తహసీల్దార్ బదులిచ్చారు. ఈలోగానే ఆ అన్నదమ్ములు అసహనంతో బయటకు వచ్చి వెంట తెచ్చుకొన్న పెట్రోలు ఒకరిపై ఒకరు చల్లుకొన్నారు. రెవెన్యూ సిబ్బంది గమనించి వెంటనే అడ్డుకున్నారు. విషయం తెలిసి తహసీల్దార్ వచ్చి సర్వేయర్‌తోపాటు వారిని వెంటబెట్టుకొని క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. రవికుమార్,చంద్రశేఖర్ సాగు చేస్తున్న 3.92 ఎకరాల భూమి రెవెన్యూ పొరెస్టుకు చెందినదని తేల్చారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడమే కాకుండా తమ విధులకు ఆటంకం కలిగించారని ఈఅన్నదమ్ములపై డిప్యూటీ తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా 'సామంచి' బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 29(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సామంచి శ్రీనివాస్ బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు మంత్రి సత్యకుమార్, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి ఆడిటోరియం వరకు సమాంచి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు చేపట్టారు. ఎస్వీయూలో విద్యార్థి నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేసిన సామంచి శ్రీనివాస్.. వామపక్ష భావాలుగల వారితో విబేధించి జైలు జీవితం కూడా గడిపారని మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తుచేశారు. ఆయన కృషికి తగిన గౌరవం లభించిందన్నారు. సీనియర్లను గౌరవిస్తూ, కొత్తవారిని కలుపుకుంటూ, కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తూ పనిచేయాలని సూచించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ సమర్థంగా అధ్యక్ష బాధ్యతలను నెరవేరుస్తారని చంద్రగిరి ఎమ్మెల్యే నాని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, కీలకమైన జిల్లా బాధ్యతలను సామంచికి ఇవ్వడం ఆయన సామర్థ్యానికి గీటురాయి అని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. తాను, సామంచి కలిసి ఎన్నో పోరాటాలు చేశామని, జైలు జీవితం కూడా గడిపామని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్ష బాధ్యతలకు ఆయన న్యాయం చేస్తారన్నారు. 30 సంవత్సరాలుగా తనను ఎందరో పెద్దలు, నాయకులు, కార్యకర్తలు వెన్నుతట్టి ప్రోత్సహించారని, అండదండలు అందించారని సామంచి శ్రీనివాస్ చెప్పారు. వారందరి సహకారంతోనే తాను ఈ స్థానానికి చేరుకోగలిగానన్నారు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని పనిచేస్తానని, సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా యూకేకు చెందిన పారిశ్రామికవేత్త బాలకృష్ణారెడ్డి, అబుదాబికి చెందిన శ్రీనివాసరెడ్డి, తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గుణకల మురళి తదితరులు సామంచిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, కల్లపల్లి నరసింహారెడ్డి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, చంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న సామంచి

జగన్ విలాసాలకు రూ.10 లక్షల కోట్ల అప్పులు


ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ తన విలాసాలకు ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లు అప్పు చేసి ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే పరిస్థితి తీసుకొచ్చారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆరోపించారు. బుధవారం పలమనేరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. అప్పులు పుట్టని స్థితి రాష్ట్రంలో ఏర్పడిందని.. ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇవన్నీ ప్రస్తుత ప్రభుత్వానికి గుదిబండలా మారిందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఈ స్థాయిలో బకాయిలు చేయలేదని, తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపైనే కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు పెట్టుకోవడం దారుణమన్నారు. తన ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెటుకొని జగన్ లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని పేర్కొన్నారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు వంటి ప్రతి అంశంలో పక్షపాతాన్ని ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు గుండె లాంటి సచివాలయాన్ని తాకట్టుపెట్టి టీడీఆర్ బాండ్లు, స్మార్టు మీటర్ల కొనుగోలు, రేషన్ బియ్యంలోనూ చేతివాటం చూపారన్నారు. చివరకు చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు లాంటి వాటిల్లోనూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడటం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తంచేశారు. జగన్ అనాలోచిత నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాలా తీసిందని.. ఇది ప్రస్తుత ప్రభుత్వానికి పెనుభారమై ప్రజలపాలిట శాపంగా మారిందని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తులు నిల్

చిత్తూరు సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి):జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు ఒక దరఖాస్తుకూడా రాలేదు. ఈ నెల 27వ తేది నుంచి ఫిబ్రవరి 5వ తేది సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తుకు అవకాశముంది.7వ తేది ఉదయం 10 గంటలకు చిత్తూరులోని షుగర్ ఫ్యాక్టరీలో లాటరీ ద్వారా దుకాణాలు కేటాయిస్తారు. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు కానీ ఒకరికి ఒక దుకాణం మాత్రమే కేటాయిస్తారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది.

రెవెన్యూ సదస్సు అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● తహసీల్దార్లకు జేసీ విద్యాధరి ఆదేశాలు


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు రూరల్, జనవరి 29: రెవెన్యూ సదస్సు ద్వారా వచ్చిన అర్జీలను త్వరగతిన పరిష్కరించాలని జేసీ విద్యాధరి తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో చిత్తూరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన అర్జీలను ఇప్పటి వరకు ఎన్నిటిని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. సదస్సు ద్వారా న్యూ ఎంట్రీ, నేమ్ కరెక్షన్.. ఇలా వెబ్‌ల్యాండ్ సమస్యల పరిష్కారానికి రోజుల తరబడి ఆలస్యమవుతోందని అన్నారు. ఇందు కోసం ఒకే చోటుకు తహసీల్దార్లను పిలిపించుకొని వెబ్ ల్యాండ్ సమస్యల పరిష్కారిస్తున్నట్లు చెప్పారు. ఒక్కరోజులోనే 11 మండలాలకు సంబంధించి 64 అర్జీల పరిశీలన పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

తండ్రి వెంటే వెళుతూ..!

● స్వర్ణముఖి వాగులో పడి బాలుడి మృతి
● ఈ విషయం తెలియక పోలీసులకు ఫిర్యాదు
● వాగులో కనిపించిన మృతదేహం


ఒడిలో బిడ్డ మృతదేహం పెట్టుకుని రోదిస్తున్న తల్లి - తేజ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బుడిబుడి అడుగులేస్తూ తండ్రి వెనక వెళ్లాడో మూడేళ్ల బాలుడు. ఆ విషయం తండ్రికి తెలియదు. స్వర్ణముఖి వాగు దాటే క్రమంలో బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ విషాద ఘటన బుధవారం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ పాతపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాతపేటకు చెందిన లోకేశ్, శరణ్యదంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు. బుధవారం తై అమావాస్య కావడంతో.. చనిపోయిన తన తండ్రి రంగాచారికి ఉదయం 11 గంటల సమయంలో లోకేశ్, కుటుంబీకులు ఇంట్లో బట్టలు పెట్టారు. ఆ తర్వాత తన తండ్రి గుంత(సమాధి) వద్దకు లోకశ్ వెళ్లారు. ఇంటి దగ్గర ఆడుకొంటున్న చిన్న కుమారుడు తేజ(3) తండ్రి వెనకాలే వెళ్లిపోయాడు. ఇది గమనించని లోకేశ్.. స్వర్ణముఖి వాగు దాటుకొని తండ్రి గుంత వద్దకు వెళ్లి.. తిరిగి ఇంటికొచ్చారు. తేజ కనిపించకపోవడంతో గాలించారు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో జాతీయ రహదారిలో గాలింపు చర్యలు చేపట్టారు. గాందంకి టోల్‌ప్లాజా వద్ద సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అనుమానంతో దామలచెరువు వరకు వాహనాలు తనిఖీ చేశారు. స్వర్ణముఖి వాగులో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన పశువుల కాపరులు గ్రామస్తులకు సమాచారమిచ్చారు. తమ కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చంద్రగిరి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మావతి వర్సిటీ దూర విద్యకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రం నిర్వహించే పలు కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఎంఏ సంగీతం, తెలుగు, ఎంకాం, మ్యూజిక్‌లో డిప్లొమో వంటి కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 31 నుంచీ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు ఫిబ్రవరి 5వ తేదీ చివరి గడువు. ఫిబ్రవరి 7 నుంచీ 12 వ తేదీ దాకా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్ కానీ, 0877-2284524 లేదా 8121787415 నెంబర్లలో సంప్రదించాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

● మళ్లీ మొదటికి

రెస్కో సిబ్బందికి తప్పని 'పరీక్ష'

● విచారణ నివేదికలో నిర్ణయం


రెస్కో సిబ్బందికి నిర్వహించిన పోల్ టెస్ట్ (ఫైల్ ఫొటో)

కుప్పం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కో (గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ) సిబ్బందికి మళ్లీ 'పరీక్ష' తప్పదా? వైసీపీ హయాంలో వివిధ ఉద్యోగాల్లోకి తీసుకున్న సిబ్బంది మొత్తం అర్హత పరీక్షను ఎదుర్కోవాల్సిందేనా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే లభిస్తోంది. రెస్కో విచారణ నివేదికను అధికారులు బయటపెట్టకపోయినా, ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు వందకు పైగా కింది స్థాయి సిబ్బంది, ఆయా ఉద్యోగాల్లో కొనసాగడానికి తమ అర్హత మరోమారు నిరూపించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి దాదాపు ఆరేడు నెలల క్రితం కుప్పం రెస్కోలో సుమారు 122 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. వీరిలో 109 మందిని అసిస్టెంట్ హెల్పర్లుగా నియమించుకున్నారు. మిగిలిన వారికి వివిధ విభాగాల్లో ఉద్యోగాలు కల్పించారు. వైసీపీ హయాం చివరి రోజుల్లో జరిగిన ఈ నియామకాలకోసం అప్పట్లో ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. దీంతో టీడీపీ అధికారంలోకి రాగానే రెస్కోలో జరిగిన అవినీతిని టార్గెట్ చేసింది. నాటి పాలకులు పదవులకు రాజీనామా చేయగా అక్రమంగా పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగుల్లో గుబులు పుట్టింది. అప్పటి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకుంటూనే రెస్కోలో జరిగిన అక్రమ నియామకాలు, అవినీతి చర్యలపై విచారణ ప్రారంభమైంది. సంస్థలో ఉద్యోగులను ఎన్నికలకు ముందు భారీగా అవసరానికి మించి తీసుకున్నారని గుర్తించిన జేసీ, దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగాలు పొందిన 122 మందిలో అసిస్టెంట్ హెల్పర్లుగా ఉన్న 109 మందిని పరీక్షలకు పిలువగా 104 మంది హాజరయ్యారు. పోల్ టెస్ట్ (స్తంభాలు ఎక్కడం)తో పాటు ఇతర నైపుణ్య పరీక్షలను గతేడాది జూలై 5వ తేదీన శాంతిపురంలో నిర్వహించారు. ఉదయంనుంచి సాయంత్రం దాకా పోల్ టెస్ట్‌తోనే సరిపోయింది. ఈ టెస్ట్‌కు హాజరైన వారిలో కొందరు పోల్ ఎక్కడకుండానే ఇళ్లకు వెళ్లిపోగా, మరికొందరు ఎక్కడానికి ప్రయత్నించి విఫలమై వెనుదిరిగారు. పోల్ టెస్ట్ అనంతరం రీడింగ్ తీయడం, మెటీరియల్ వేరుచేయడం, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ అటెండ్ కావడం వంటి ఇతర నైపుణ్య పరీక్షలను అదే శాంతిపురం రెస్కో కార్యాలయంలో నిర్వహించారు. ఎంతమంది అనర్హులుగా తేలారన్న ప్రశ్నకు అధికారులు అప్పట్లో సరైన సమాధానం ఇవ్వలేదు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, తర్వాత వారి ఆదేశాల ప్రకారమే చర్యలు ఉంటాయని చెప్పుకొచ్చారు.

● విచారణ నివేదికతో మళ్లీ 'పరీక్ష'

అర్హత పరీక్షలైతే నిర్వహించారు కానీ, అధికారులు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఉద్యోగులందరూ ఇప్పటిదాకా తమతమ విధుల్లోనే కొనసాగుతున్నారు. అయితే రెస్కోలో వైసీపీ హయాంలో జరిగిన అవకతవకలపై సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని ప్రభుత్వం విచారణాధికారిగా నియమించింది. ఆమె గతేడాది జూలై 18న ఒకసారి, ఆగస్టు 29న మరోసారి కుప్పం రెస్కో ప్రధాన కార్యాలయానికి వచ్చి సిబ్బందిని విచారించడంతోపాటు అవకతవకలకు సంబంధించిన పలు రికార్డులను వెంట తీసుకుని వెళ్లారు. కేవలం సిబ్బంది నియామకాలకు సంబంధించిన ఫైళ్లనే కాక 2010 నుంచి చేసిన సవరణల వివరాలు తేదీలు, ఆర్డర్లు, లైసెన్సులు, విద్యుత్తు సరఫరా, 2019 నుంచి సంవత్సరాల వారీగా బడ్జెట్టు, క్యాడర్ స్ట్రెంత్, పదోన్నతులు, జనరల్ బాడీ సమావేశాల మినిట్స్ పుస్తకాలు, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు, ప్రాజెక్ట్ ఇంజనీరు పి.సుబ్రమణ్యం సర్వీస్ వివరాలు, సిబ్బంది జీతభత్యాల పెంపు, గ్రాట్యుటీల చెల్లింపు వంటి రికార్డులు అందులో ఉన్నాయి. అంటే ఆయా అంశాలలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, ఫిర్యాదుల వల్ల విచారణ అధికారి వాటిని తీసుకు వెళ్లారు.

● సిబ్బందిలో గుబులు

విచారణ ముగిసి నివేదిక ప్రస్తుతం అధికారులకు చేరింది. వైసీపీ హయాంలో ఉద్యోగాలు పొందిన అందరిపై విచారణ నివేదిక ఒక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అప్పట్లో ఉద్యోగాల్లో చేరిన వారికి అంటే మొత్తం 122 మంది సిబ్బందికీ మళ్లీ అర్హత పరీక్ష పెట్టాలన్నదే ఆ నిర్ణయం. గతంలో అప్పటి జేసీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు జరిగిన అర్హత పరీక్షల్లో సైతం అక్రమాలు చోటు చేసుకోవడంవల్లే నివేదికలో మళ్లీ పరీక్ష పెట్టాలన్న నిర్ణయం చేరిందంటున్నారు. అప్పట్లో ఈ పరీక్షలు నిర్వహించిన రెస్కో అధికారులు సైతం స్వయంగా అవినీతి ఆరోపణల్లో కూరుకుపోవడం దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. తమ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడిందని, వైసీపీ హయాంలో కొత్తగా తీసుకున్నవారందరినీ ఉద్యోగాలనుంచి తొలగించేస్తారని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. విచారణ నివేదికలో ఇటువంటి నిర్ణయాలే జరిగాయని ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటికిప్పుడు సిబ్బందిని తొలగించే ప్రమాదమైతే కనిపించడంలేదు. ముందుగా అర్హత పరీక్షలు నిర్వహించనున్నారు. తర్వాతే ఎటువంటి నిర్ణయమైనా తీసుకునే అవకాశం ఉంది. సిబ్బందికి మళ్లీ అర్హత పరీక్ష నిర్వహించనున్నారన్న విషయం తప్ప మిగిలిన విచారణ నివేదికలోని అంశాలేవీ బయటకు రావడంలేదు. దీనిపై డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి వనజను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, రెస్కోలో గతంలో ఉద్యోగాల్లో తీసుకున్న సిబ్బందికి అర్హత పరీక్ష నిర్వహించాలని విచారణ నివేదికలో ఉన్న మాట వాస్తవమేనన్నారు. నివేదికలోని మిగిలిన అంశాలను రెస్కో జనరల్ బాడీ సమావేశంలో పెట్టి బహిర్గత పరచి, అందులోని ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని ఎండీని ఆదేశించినట్లు చెప్పారు.

పేటమిట్టలో భూగర్భ డ్రైనేజీ, పశువైద్యశాల ప్రారంభం


పశువైద్యశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్,గల్లా రామచంద్ర నాయుడు

పూతలపట్టు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ నిర్మూలనకు గల్లా రామచంద్ర నాయుడు చేపట్టిన కృషి అసామాన్యమని ఎమ్మెల్యే మురళీమోహన్,కలెక్టర్ సుమిత్ కుమార్ అభిప్రాయ పడ్డారు. పూతలపట్టు మండలం తలుపులనేని వారిపల్లి (పేటమిట్ట) గ్రామంలో రాజన్న ఫౌండేషన్ సౌజన్యంతో రూ.2 కోట్ల నిధులతో ఏర్పాటుచేసిన భూగర్భ డ్రైనేజీ, గ్రామీణ పశు వైద్యశాలను బుధవారం సాయంత్రం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపార దిగ్గజంగా ఎదిగిన రామచంద్ర నాయుడు రాజన్న ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఎనలేని సేవలందిస్తున్నారని కొనియాడారు.అమరరాజా సంస్థల వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యనందించడం కోసమే విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్, భూగర్భ జలవనరులశాఖ ఇంజనీర్ విజయ్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు రాళ్ళపల్లి సతీష్, మంగళ విద్యాలయ ప్రిన్సిపాల్ గల్లా ధనంజయ నాయుడు, సర్పంచ్ గల్లా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలవుతుంది

● కలిసి కట్టుగా రాక్షసపార్టీ ఉనికి లేకుండా చేద్దాం
● 'కూటమి' నేతలు, శ్రేణులకు మంత్రి సత్యకుమార్ పిలుపు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తుందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పష్టంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో వెంటిలేటర్‌పైకి చేరిన రాష్ట్రానికి.. ఏడు నెలలుగా కూటమి ప్రభుత్వం ఆక్సిజన్ అందించి నడిపిస్తోందన్నారు. తిరుపతిలో బుధవారం జరిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తూ మన బలాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో కూటమికి 57 శాతం.. వైసీపీకి 39 శాతం వచ్చాయని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో ఆ 39 శాతాన్ని మనం కైవసం చేసుకునేలా కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలు వేరైనా ఒక్కటిగా పనిచేస్తూ రాబోయే ఎన్నికల్లో రాక్షస పార్టీ ఉనికి లేకుండా చేద్దామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి బాట ఎక్కించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ ఏడు నెలల్లో పోలవరానికి కేంద్రం రూ.12వేల కోట్లు ఇచ్చింది. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో రాజధాని నిర్మాణం ఊపందుకుంది. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రణాళికమేరకు కేంద్రం రూ.15 వేల కోట్లను రాజధానికి అందజేసింది. ప్రపంచం అబ్బురపడే రాజధాని ఎన్డీయే కాలంలోనే సాకారమవుతుంది' అని మంత్రి తెలిపారు. ఇన్ని పనులు శరవేగంగా జరుగుతుంటే.. పెన్షన్ పెంపు, ఉచిత సిలిండర్లు ఇస్తుంటే.. ఇవన్నీ మర్చిపోయి కొందరు సూపర్ సిక్స్ అంటున్నారన్నారు. అవీ అమలవుతాయని స్పష్టంచేశారు. ఈ విషయంలో మన నాయకులు, కార్యకర్తలే మన ప్రభుత్వాన్ని విమర్శిస్తుండటం సరికాదన్నారు. 'రాష్ట్రానికి చికిత్స జరుగుతోంది. త్వరలో అన్నీ చక్కబడతాయి. కూటమి కార్యకర్తలు, అభిమానులు కాస్తంత సంయమనం పాటించాలి' అని కోరారు.

పరిశ్రమల ఏర్పాటుకు భూ కేటాయింపుపై దృష్టి

చిత్తూరు సెంట్రల్,జనవరి29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవసరమైన భూమి కేటాయింపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయడంలో భాగంగా జిల్లాలో పరిశ్రమల స్థాపన, ఆర్థిక పురోభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి భూములు కేటాయించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.544 కోట్లతో 59,044 మందికి ఉపాధి కల్పించేలా 14,761 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు పోర్టల్‌లో దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సింగల్ డెస్క్ పోర్టల్ కింద 19 డిసెంబరు 2024 నుంచి 28 జనవరి 2025 వరకు 109 దరఖాస్తులు స్వీకరించగా, 71 కి అనుమతి ఇచ్చామన్నారు. పీఎం ఉపాధి హామీ కల్పన కింద రూ.4.73 కోట్లతో 131 యూనిట్లు ఏర్పాటుకు అనుమతి ఇచ్చామన్నారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల సర్వే ఫిబ్రవరి ఒకటి వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జీఎం ఇండస్ట్రీస్ వెంకటరెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జీఎం సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌పై కలెక్టర్, జేసీలకు ఫిర్యాదు చేయవచ్చు

● కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల్లో ఈవ్ టీజింగ్ చేస్తే విద్యార్థులు గ్రీవెన్స్‌డేలో నేరుగా కలెక్టర్, జేసీలను కలిసి ఫిర్యాదు చేయవచ్చునని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ వాత్సల్య పథకం అమలు తీరుపై కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపుల నుంచి కాపాడేందుకు, బాల్య వివాహాలను అరికట్టేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని చెప్పారు. మండల స్థాయిలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు కమిటీని ఏర్పాటు చేసి ఈవ్ టీజింగ్ సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ధైర్యం చెప్పి సమస్య నుంచి బయటపడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా నిర్వహిస్తున్న చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో పటిష్ఠ భద్రత ఉండాలని, వారికందించే వసతుల్లో లోటుబాట్లు సరిదిద్దాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, జడ్పీ సీఈవో రవికుమార్, డీఎంహెచ్‌వో సుధారాణి, డీఈవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతోనే ప్రాణాలకు రక్షణ

● చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత


హెల్మెట్ ధారణపై ర్యాలీని ప్రారంభిస్తున్న చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మేయర్ అముద

చిత్తూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధారణతోనే ప్రాణాలకు రక్షణ లభిస్తుందని చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత అన్నారు. 36వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం హెల్మెట్ ధారణపై నగరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని మేయర్ అముదతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసినప్పుడే హెల్మెట్‌ను కూడా కొనుగోలు చేయాలని సూచించారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. అనంతరం ఈ ర్యాలీ గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమై దర్గా, ఎంజీఆర్ వీధి, చర్చివీధి, ఎల్‌జీబీ టవర్స్, ఆర్టీసీ బస్టాండు మీదుగా తిరిగి గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో నగర డీఎస్పీ సాయినాథ్, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి రూ.86 కోట్లు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

తిరుపతి(వైద్యం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆయుర్వేద వైద్య సేవలను అందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో రూ.86 కోట్ల నిధులను మంజూరు చేసిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ పరిధిలోని అవిలాలలో నూతనంగా నిర్మించిన సమత ఆయుర్వేద ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం మనకు పూర్వీకులు ఇచ్చిన వరమన్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో ఆయుష్ శాఖకు కేవలం రూ.33 కోట్లు మాత్రమే విడుదల చేసిందని వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆస్పత్రిలో కేవలం పట్టణ ప్రాంత వాసులకే కాకుండా గ్రామీణులకు కూడా సేవలు అందించాలని ఆస్పత్రి నిర్వాహకురాలు సమత ప్రకాష్‌కు సూచించారు. ఆయుర్వేద గార్డెన్ అభివృద్ధికి సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వధర్మపీఠం అధ్యక్షుడు సోంప్రకాష్, మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నల్ల గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



హోమం చేస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 23 వార్డు మునస్వామిపురంలో బుధవారం ఉదయం నల్ల గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మునస్వామిపురం వాసులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. ముందుగా ఆలయాన్ని శుద్ధిచేసి వేద పండితులు, పూజారుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఆలయం గోపురంపై కలశ స్థాపన చేశారు. అనంతరం గర్భాలయంలో నల్లగంగమ్మ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. రాజ్‌కుమార్ అమ్మవారికి చీర సారెలు సమర్పించారు. కడా పీడీ వికాస్ మర్మత్‌తోపాటు పలువురు పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆప్టా డైరీల ఆవిష్కరణ



ఆప్టా డైరీలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఆప్టా) డైరీని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆప్టా జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మీపతిరెడ్డి, కార్యదర్శి బి.మునాఫ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.కె.అమానుల్లా, అడిషనల్ సెక్రటరీ ఎస్.అన్సర్, కార్యదర్శి ఎం.శంకర్‌రెడ్డి, మహ్మద్‌అల్లి, దాదాపీర్ సాహెబ్, సమిఉల్లాఖాన్ పాల్గొన్నారు.

పింఛను లబ్ధిదారులకు నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

పలమనేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన సదరన్ క్యాంప్‌లో పెన్షన్ తీసుకొంటున్న లబ్ధిదారులకు నేత్రపరీక్షలు నిర్వహించారు. పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి, కల్లాడు, మండిపేట, జరావారిపల్లి కూర్మాయి, గంగవరం మండలంలోని కీలపట్ల సచివాలయాల పరిధిలో కంటి లోపం కారణంగా పెన్షన్ తీసుకొంటున్న లబ్ధిదారులకు నేత్రలోప నిర్ధారణ కోసం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

రైతులకు నష్టపరిహారం పంపిణీ



రైతులకు నష్ట పరిహారం అందజేస్తున్న ఎంపీడీవో నారాయణ

సోమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఏనుగుల దాడులతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం మంజూరైనట్లు సోమల అటవీశాధికారి ఇంద్రాణి, ఎంపీడీవో నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చిన్నఉప్పరపల్లె పంచాయతీలోని పలువురికి పరిహారం డీడీలు అందజేశారు. పుంగనూరు రేంజ్ పరిధిలోని సదుం, సోమల, చౌడేపల్లె , పెద్దపంజాణి మండలాల్లో ఏనుగుల దాడులతో 129 మంది రైతులకుగాను రూ.11 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు రెడ్డిషాజహాన్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

గార్గేయ నదిపై వంతెన నిర్మించాలి



టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి విన్నవించిన నాయకులు

సోమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని మండల టీడీపీ నాయకులు బుధవారం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గార్గేయ నదిపై వంతెనలు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలని, దుర్గంకొండలో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను అటవీశాఖ అభ్యంతరం చెప్పడంతో మంజూరైన పనులు ఆగిపోతున్నాయని వివరించారు. సోమల-పెద్దఉప్పరపల్లె మార్గంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచ్ బాలాజీ నాయుడు, జయప్రకాశ్ రెడ్డి తెలిపారు.

రాష్ట్రీయ మిలటరీ పరీక్షలో పుంగనూరు విద్యార్థి ప్రతిభ



పూర్ణచంద్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ మిలటరీ పరీక్షల్లో పుంగనూరు విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు శ్రీకృష్ణారెడ్డి చైతన్య చిల్డ్రన్స్ అకాడమి పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 22న బెంగళూరులో జరిగిన రాష్ట్రీయ మిలటరీ పరీక్షల్లో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా పూర్ణచంద్ ప్రతిభ కనబరిచి సైనిక్ పాఠశాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యం



ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు, అధ్యాపకులు

పుంగనూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని పుంగనూరు శుభా రాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి చెత్త, పిచ్చిమొక్కలు తొలగించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రమించడంతో పాటు సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.రాజశేఖర్, సోమరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి



నారా భువనేశ్వరిని కలిసిన రొంపిచెర్ల రైతులు

రొంపిచెర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలో పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పీలేరు సమీపంలోని హెరిటేజ్ డెయిరీకి బుధవారం వచ్చిన హెరిటేజ్ వైస్ చైర్మన్ నారా భువనేశ్వరిని రొంపిచెర్ల మండలానికి చెందిన పలువురు పాడి రైతులు కోరారు. పాలు పితికే యంత్రాలు, గడ్డి కత్తిరించే యంత్రాలు రాయితీలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చెంగల్‌రెడ్డి, మందపల్లె రఘునాథ, మనోజ్, మధవరావ్, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య మృతికి కారకులను అరెస్టు చేయాలి : బాస్

సదుం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రమణయ్య మృతికి కారణమైన పవన్ కుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని భారతీయ అంబేద్కర్ సేన(బాస్), ఎమ్మార్పీఎస్ , ఎంఎస్‌పీ నాయకులు డిమాండు చేశారు. పీలేరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రమణయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కోర్టులో దళితుడైన రమణయ్యకు అనుకూలంగా తీర్పు రావడాన్ని జీర్ణించుకోలేని పవన్ కుమార్‌రెడ్డి కక్షపూరితంగా అతనిపై దాడి చేశాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అతడిని అరెస్టు చేయాలన్నారు. రమణయ్య కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాస్ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, ఆనంద్ కుమార్, హరినాథ, రెడ్డప్ప, ప్రతాప్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, నాయకులు శ్రీనివాసులు, అనిల్ కుమార్, గంగాధర, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘన సన్మానం



క్రీడాకారులను సన్మానించిన కబడ్డీ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

పుంగనూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం చోడవరం అంకుపాలెంలో జరిగిన 71వ అంతర్ జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం పురుషుల జట్టు ద్వితీయ స్థానం, మహిళల జట్టు తృతీయస్థానం సాధించిన క్రీడాకారులు, టీమ్ కోచ్ మేనేజర్లను పూలమాలలు, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామచంద్ర, గంగాధర్, మణి, వెంకటరమణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో చౌడేపల్లె క్రీడాకారుల ప్రతిభ



జ్ఞాపిక అందిస్తున్న హెచ్‌ఎం నాగరాజరెడ్డి

చౌడే పల్లె, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): అంత ర్ జిల్లా కబడ్డీ పోటీల్లో చౌడేపల్లె క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం నాగరాజరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని అంకుపాళ్యంలో జరిగిన అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో చిత్తూరు జిల్లా బాలికల జట్టు మూడో స్థానం సాధించిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన చౌడేపల్లె హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు రూప, సుమతిలకు బహుమతులు అందించారు. బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ రాజేంద్ర, ఉపాధ్యాయులు మురళీ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణ కల్పించండి

కుప్పం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పెద్దబంగారునత్తం పంచాయతీ సర్పంచ్ రోహిత్ తండ్రి రవి నుంచి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కుప్పం డీఎస్పీ పార్థసారథికి అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్, గ్రామ సేవకుడు డి.కనకరాజు బుధవారం ఫిర్యాదు చేశారు. ఊరి చెరువును మరమ్మతు చేయకపోవడంతో నీరు లేక పంటలు పెట్టుకోలేకపోతున్నామంటూ కనకరాజు ఈనెల 21వ తేదీన ఓ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'పంచాయతీ చెరువు గురించి తమకు వ్యతిరేకంగా వీడియో పెట్టి ప్రచారం చేస్తావా? నువ్వు, నీ కుటుంబ సభ్యులు ప్రాణాలతో ఉండాలా వద్దా?' అని తనను రవి బెదిరించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రవి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని డీఎస్పీని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



అల్లాబక్ష్ (ఫైల్ ఫొటో)

సదుం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సదుంలో జరిగింది. ఎస్‌ఐ షేక్ షావలి కథనం మేరకు .. సదుం గ్రామానికి చెందిన అల్లాబక్ష్(57) స్థానికంగా తనకున్న 10 గుంటల భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లిన ఆయన సమీపంలోని మోటారు షెడ్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె భవనాల్లోనే 'గురుకులం'..!

- అసౌకర్యాలతో అవస్థలు పడుతున్న విద్యార్థులు
- తరగతి గదుల నిర్మాణానికి రూ.12.11 ఎకరాల కేటాయింపు
- నిధులు మంజూరైనా మరుగున పడేసిన వైసీపీ ప్రభుత్వం
- అన్యాక్రాంతమవుతున్న పాఠశాల స్థలంలో మట్టి తరలింపు



గురుకుల పాఠశాల స్థలంలో తొలగించిన బోర్డు



మట్టి తరలింపుతో గుంతలమయంగా మారిన స్థలం



బండరాయిని అక్రమంగా ధ్వంసం చేసిన అక్రమార్కులు

పెద్దపంజాణి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఉన్నతాశయంతో గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ప్రస్తుత పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి 2014-19 మధ్య కాలంలో మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కోసం పెద్దపంజాణి మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో 12.11 ఎకరాలు కేటాయించారు. అప్పటి వరకు రాయలపేటలో అద్దె భవనంలో నడుస్తోంది. భవన సదుపాయం లేకపోవడంతో శంకర్రాయలపేటలో అద్దె భవనానికి మార్చారు. దీంతో సమస్యను అప్పట్లో మంత్రి దృష్టికి తీసుకుపోవడంతో సొంత భవనానికి సైతం దాదాపు రూ.16 లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే టెండర్లు పిలిచేలోపు 2019లో ప్రభుత్వం మారడంతో ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా మరుగున పడేసింది. సంబంధిత పాఠశాల సిబ్బంది పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారు లేకపోగా మంజూరైన నిధులు సైతం రద్దు చేశారు. దీంతో గురుకుల పాఠశాల భవన నిర్మాణ సమస్య మరుగున పడింది. విద్యార్థులు అసౌకర్యాల నడుమ అద్దె భవనంలోనే విద్యనభ్యసిస్తున్నారు. విషయం తెలుసుకున్న అక్రమార్కులు కొందరు ఈ భూమిని ఆక్రమించుకునే పనిలో పడ్డారు. మరికొందరు ఇక్కడ చదునుగా ఉన్న భూమిలో అక్రమంగా వేల లోడ్ల మట్టి తరలించి గుంతలమయం చేశారు. రాళ్లు, బండలు మిగిల్చి ఎందుకు పనికిరాని భూమిగా మార్చారు. చదునుగా ఉన్న బండను సైతం పగులగొట్టి అక్రమంగా తరలించేశారు. పలుమార్లు స్థానికులు అక్రమంగా తరలిస్తున్న మట్టిని, రాయిని అడ్డుకున్నా పట్టించుకునేవారు లేకపోవడంతో ఈ స్థలం ప్రస్తుతం చీకటి కార్యకలాపాలకు ఆవాసంగా, జూదరుల నిలయంగా, తాగుబోతుల నివాసంగా మార్చుకున్నారు. ప్రస్తుతం ఈ స్థలం నుంచి ఉన్న మట్టిని తరలించడమే కాకుండా చదునుగా ఉన్న బండరాయిని పగులగొట్టి తరలిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు దృష్టి సారించి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

మంగళంపేట అడవిలో
ఆక్రమణలు త్వరలో వెలికితీస్తారు

చల్లా రామచంద్రారెడ్డి



రొంపిచెర్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై విమర్శలు చేయడం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తగదని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజా సొమ్మును, ఆస్తులు అక్రమ మార్గంలో ఆర్జించిన పెద్దిరెడ్డి కుటుంబం ఏంటో అందరికీ తెలుసన్నారు. 30 సంవత్సరాలు కాంట్రాక్టరుగా, నాలుగు సంవత్సరాలు మంత్రిగా తిరుపతి, పుంగనూరు, తంబళ్లపల్లెలో బంధువుల పేరున భూములు సంపాదించిన ఘనత అందరికీ తెలుసన్నారు. వైసీపీ నాయకులు ఎన్నికల్లో ఓడిపోయినా చంద్రబాబును విమర్శించడం మానలేదన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అన్యాయాలు, అక్రమార్జనలు పక్కనపెట్టి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లను విమర్శించడం దారుణమన్నారు. మంగళంపేట అటవీ ప్రాంతంలో ఆక్రమణలు, భవనాలు అధికారులు పరిశీలించి త్వరలో అక్రమాలు వెలికితీస్తారన్నారు. అక్రమాలు వెలికితీసిన పత్రికలపై ఆరోపణలు మానాలని చల్లా రామచంద్రారెడ్డి హెచ్చరించారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి



రవీంద్రనాథ్ ఠాగూరు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి

పుంగనూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వకవి, జాతీయగీతం సృష్టికర్త రవీంద్రనాథ్ ఠాగూర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని విశ్రాంత ఐఏఎస్, ఉమ్మడి రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి దిట్టకవి చక్రపాణి పిలుపునిచ్చారు. బుధవారం పుంగనూరు మండలం అడవినాథునికుంట మోడల్ స్కూల్ ఆవరణలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాన్ని ఆయన ప్రతిష్ఠించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ జాతీయ గీతాన్ని రచించిన మహా మేధావి అని అభివర్ణించారు. పరివర్తన సంస్థ అధ్యక్షుడు, విశ్రాంత ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎనిమిదేళ్ల వయస్సులోనే ఆయన సాహిత్యానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని, 1913లో ప్రతిష్ఠాత్మకమైన నోబుల్ అవార్డు దక్కిందని, జాతీయ గీతాలపన మదనపల్లె బీటీ కాలేజీలో జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటశివారెడ్డి, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముచ్చుకోట సురేశ్‌బాబు, ప్రకృతివనం ప్రసాద్, పరివర్తన సంస్థ నిర్వాహకులు డాక్టర్ కంజుల స్పందన, ఆర్‌ఈఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్. రమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో లీలామాధవికి ఘన సన్మానం



ఎంపీడీవో లీలామాధవిని సన్మానిస్తున్న ఉపాధి సిబ్బంది

చౌడేపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లెలో ఎంపీడీవో లీలామాధవిని ఉపాధి హామీ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకోవడంతో ఆమెను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో చిన్నరెడ్డమ్మ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో జేఈ కోదండపాణి, టీఏలు ధనంజయుడు, అమర్‌నాథ్, సైద్‌బాషా, భరత్ పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురిపై కేసు నమోదు

రామకుప్పం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పొలంలో మూత్రం విసర్జించడాన్ని ప్రశ్నించిన రైతుపై ఐదుగురు దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రామకుప్పం ఎస్‌ఐ వెంకటమోహన్ కథనం మేరకు.. మండల పరిధి వీర్నమలకు చెందిన చంద్రానాయక్ పొలంలో ఈనెల 22న మురుగేష్ మూత్రం విసర్జించాడు. చంద్రానాయక్ పశ్నించడంతో వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం మురుగేష్ తన కుమారుడు వినోద్, అతని బంధువులు కుమార్, కస్తూరిలతో కలిసి చంద్రానాయక్‌పై దాడికి పాల్పడ్డారు. చంద్రానాయక్ కుమారుడు పన్నీర్‌నాయక్ బుధవారం రామకుప్పం పోలీసులను ఆశ్రయించాడు. పన్నీర్‌నాయక్ ఫిర్యాదు మేరకు మురుగేష్, వినోద్, కుమార్, కస్తూరిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయుష్మాన్‌తో ఉచిత వైద్య సేవలు

చౌడేపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్‌లో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆసుపత్రిలో ఆయుష్మాన్ భారత్ కార్డులను నమోదు చేశారు. అలాగే స్థానిక బాలికల వసతి గృహంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోర్టు విధుల బహిష్కరణ

పలమనేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బెజవాడకు చెందిన న్యాయవాది బిక్షమయ్యపై అక్రమ కేసు నమోదు చేసిన సంఘటనపై వారు కోర్టు విధులకు హాజరు కాలేదు. ఈ సందర్భంగా పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి మాట్లాడుతూ న్యాయవాదిపై అక్రమ కేసును వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈనెల 30వ తేదిన నిరసనలో భాగంగా విధులకు హాజరు కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బిక్షమయ్యపై అక్రమ కేసును రద్దుచేయాలని డిమాండు చేశారు.

పవన్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేయాలి

పలమనేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దళిత నాయకుడు సదుం రమణయ్య మృతికి కారకుడైన పవన్‌కుమార్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని పలమనేరులోని మానవ హక్కుల సంఘం, అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షులు డీవీ మునిరత్నం డిమాండు చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రమణయ్యకు పవన్‌కుమార్‌రెడ్డికి భూవివాదాలు ఉన్నప్పటికీ రమణయ్య భూమి వదలక సాగుచేసుకొంటున్నారని పేర్కొన్నారు. రమణయ్య మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి పవన్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేయాలని కోరారు.

రమణయ్య కుటుంబానికి పెద్దిరెడ్డి పరామర్శ

సదుం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భూతగాదా కారణంగా గుండెపోటుతో మృతి చెందిన రమణయ్య మృతదేహాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం సందర్శించారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రమణయ్య మృతదేహానికి నివాళులర్పించారు. రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొని మృతుని కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

మృతిపై డీఎస్పీ విచారణ

సదుం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎస్సీ, ఎస్టీసెల్ డీఎస్పీ రాంబాబు బుధవారం రమణయ్య మృతిపై విచారణ చేపట్టారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ని రమణయ్య మృతదేహాన్ని పరిశీలించిన ఆయన సంఘటన జరిగిన తీరుపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసులను విచారించారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని ప్రజాసంఘాల నాయకులు, రమణయ్య కుటుంబసభ్యులకు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతి



నవీన్‌కుమార్

పుంగనూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు-మదనపల్లె మార్గంలోని సుగాలిమిట్ట సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనాన్ని ఓ ఆటో ఢీకొనడంతో ప్రైవేటు ఉద్యోగి మృతిచెందాడు. వివరాలిలా... పుంగనూరు తాటిమాకులపాళ్యంలో కాపురం ఉన్న ఆదినారాయణ కుమారుడు నవీన్‌కుమార్(36) మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం విధులకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా సుగాలిమిట్ట వద్ద మదనపల్లె వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఓ ఆటో ఢీకొనడంతో నవీన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూవివాదంలో పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

గుడుపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుప్పిగానిపల్లెలో జరిగిన భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ పడి పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. అగరం రెవెన్యూలో ఓ సర్వేనంబరులో 0.92 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన గోవిందప్ప భార్య పాపనాశమ్మకు వీఆర్‌ఏ బాలకృష్ణ కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. పాపనాశమ్మ ఈ భూమిపై కోర్టులో కేసు వేసింది. ఆమెకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. ఈ భూ వివాదంపై పాపనాశమ్మ తహసీల్దారు సీతారామ్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. బుధవారం వీఆర్‌వోలు, సర్వేయర్లు భూమిని సర్వే చేయడానికి వచ్చారు. ఈక్రమంలో వీఆర్‌ఏ బాలకృష్ణ, పాపనాశమ్మ కుటుంబసభ్యులు ఘర్షణ పడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సీతారామ్‌ను వివరణ కోరగా కుప్పిగానిపల్లెలో ఇరువర్గాల వారితో తాను మాట్లాడానని గురువారం వివాద భూమిని సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

ఉపాధి హామీలో తీర్మానాలు లేకుండానే పనులు

- సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆగ్రహం



ఉపాధి సిబ్బందిని నిలదీస్తున్న వైస్ ఎంపీపీ ప్రభాకర్

సోమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో సర్పంచుల తీర్మానాలు లేకుండానే పనులు చేపడుతున్నారని.. కనీస సమాచారం ఇవ్వడం లేదని పలువురు సర్పంచులు ఆరోపించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో నారాయణ నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా పలు పనులు చేపట్టినా బిల్లులు పంపిణీ చేయలేదని ఇరికిపెంట సర్పంచి రెడ్డెప్ప, అన్నెమ్మగారిపల్లె ఎంపీటీసీ సర్వేశ్వరమ్మ, నడింపల్లె సర్పంచి వెంకటరమణ వాపోయారు. ఉద్యానశాఖ నుంచి రాయితీ ఇస్తున్నట్లు ప్రకటనలే తప్ప.. కార్యరూపం లేదని ఎంపీటీసీలు జిన్నా, నాగభూషణంరెడ్డి, సభ దృష్టికి తెచ్చారు. టమోటా రైతులకు రాయితీతో మొక్కలు అందజేయాలని సభ్యులు కోరారు. సోమలలో మినరల్ వాటర్ కోసం నిర్మించిన ప్లాంట్లు పనిచేయడం లేదని, ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లకుండా రోడ్డుపైనే ఆపేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సావిత్రమ్మ సభ దృష్టికి తెచ్చారు. నెల్లిమంద పంచాయతీ నవాబ్ పేటలో తక్కువ వయస్సులోనే ఆడపిల్లలకు వివాహాలు చేస్తున్నారని కందూరు వైద్యాధికారి విజయలక్ష్మి సభలో వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ కుసుమ, వైస్ ఎంపీపీ ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, ఎంఈవోలు కేశవరెడ్డి, శివరత్నమ్మ, ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, ఏపీఎం శివయ్య, జేఈలు అనూష, మహేంద్రరెడ్డి, ఆనంద్, వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ జయసింహ, ఎఫ్ఎస్‌వో ఇంద్రాణి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న ఈడిగ సంఘం నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): సీఎం నారా చంద్రబాబు చిత్రపటానికి గురువారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఈడిగ సంఘం నేతలు పాలాభిషేకం చేశారు. ఈడిగ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కల్లుగీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. చంద్రబాబు పాలనలోనే బీసీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారని అన్నారు. నేతలు నాగరాజు గౌడ్, నీరజాక్షులు గౌడ్, జనార్దన్ గౌడ్, తారక్ గౌడ్, గోపి గౌడ్, గజేంద్ర గౌడ్, మహేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి కొలను
సుందరీకరణకు నిధులివ్వించండి

● చుడా చైర్మన్ కటారి హేమలతకు గ్రామస్థుల వినతి


భక్తాంజనేయస్వామి విగ్రహం వద్ద కటారి హేమలత

గంగాధరనెల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీరకనెల్లూరు గ్రామంలోని భక్తాంజనేయస్వామి కొలను సుందరీకరణకు నిధులు మంజూరు చేసి చేయూత అందించాలని చుడా చైర్మన్ కటారి హేమలతకు గ్రామస్థులు వినతపత్రం అందజేశారు. గంగాధరనెల్లూరు మండలం వీరకనెల్లూరు గ్రామానికి చుడా చైర్మన్‌గా తొలిసారి హేమలత విచ్చేయగా, అధికారులు, గ్రామస్థులు, సచివాలయ ఉద్యోగులు శాలువలు కప్పి, పూలమాలలువేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని తామరపూల కొలనులో ఏర్పాటుచేసిన భక్తాంజనేయస్వామిని హేమలత దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు కొలను చుట్టూ సుందరీకరణ, వాకింగ్ ట్రాక్, విలేజ్ ఐకాన్‌లను ఏర్పాటు చేయించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆమె వెంటనే చుడా ఇంజనీరింగ్ అధికారులకు ఫోన్‌చేసి ఈ పనులకు ఎస్టిమేషన్ వేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చిట్టెమ్మ, చిత్తూరు కో ఆప్షన్ మెంబర్ కోలా కిరణ్, మాజీ కార్పొరేటర్ కందా పాల్గొన్నారు.

ఆటస్థలం కోసం ప్రతిపాదనలు పంపండి: కలెక్టర్

బంగారుపాళ్యం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుమంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆటస్థలం కోసం ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి టేకుమంద ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం గ్రామసమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామస్తులు తమ గ్రామంలోని పాఠశాలకు ఆటస్థలం కేటాయించి, ప్రహరీగోడ నిర్మాణానికి సహాయం చేయాలని విన్నవించారు. దీంతో కలెక్టర్ స్పందించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని తహసీల్దార్‌కు సూచించారు. గ్రామస్తులు ఎగ్గిడి భాస్కర్, సుబ్బన్న, మణి, జానకిరామ్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌నాయుడు, ధరణీ, జనార్ధన్‌గౌడ్, హేమచంద్రనాయుడు ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు
బాధ్యత తీసుకోవాలి

వెదురుకుప్పం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల బాధ్యత కీలకమని, అదే స్థాయిలో తల్లిదండ్రుల బాధ్యత కీలకమేనని, ఆ బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద అన్నారు. బుధవారం ఆ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తరచుగా విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి తమ పిల్లలు సక్రమంగా వస్తున్నారా? లేదా? అని తెలుసుకోవాలన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు


ఉన్నత పాఠశాల వద్ద చెత్త తొలగిస్తున్న దృశ్యం

యాదమరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద గ్రామస్థుల వినతి మేరకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం చెత్త తొలగింపు చేపట్టారు. గత కొద్దిరోజులుగా ఉన్నత పాఠశాల ఆవరణ ముందు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండడంతో స్థానికులు, సచివాలయ సిబ్బంది కలిసి ఈవోపీఆర్డీ సుకుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎక్స్‌కవేటర్ సహాయంతో చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు.

ఆప్టా డైరీ ఆవిష్కరణ



చిత్తూరు సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఆప్టా) ముద్రించిన 2025 వార్షిక డైరీని కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, నాయకులు హసనుల్లా, అన్సర్, శంకర్‌రెడ్డి, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పంటలకూ నానో యూరియా

వెదురుకుప్పం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అన్ని పంటలకు సురక్షితమైన, పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన వ్యవసాయానికి నానో యూరియా ఉపయోగపడుతుందని కార్వేటినగరం మండల వ్యవసాయాధికారిణి హేమలత తెలిపారు. బుధవారం కార్వేటినగరం మండలం డీఎంపురం, కేఎంపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో నానో యూరియా, నానో డీఏపీపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

గుండె జబ్బులపై అవగాహన అవసరం

వెదురుకుప్పం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులపై అవగాహన అవసరమని కార్వేటినగరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) డాక్టర్ జి.భాగ్యలక్ష్మి, డాక్టర్ డీఎస్ గోపినాథన్ తెలిపారు. బుధవారం కార్వేటినగరం సీహెచ్‌సీలో స్టెమీ ప్రోగ్రాం జరిగింది.

ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ సీఈవో తనిఖీ

యాదమరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జోడిచింతల వద్ద గల ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో వేణు, ఈవోపీఆర్డీ సుకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రవాణా శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ ర్యాలీ

చిత్తూరు సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీని దివాళా తీయించిన జగన్

● ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్‌రెడ్డి ఏపీని దివాళా రాష్ట్రంగా తీర్చిదిద్దారే తప్ప అభివృద్ధి అనేది కనిపించలేదని ఎమ్మెల్యే భానుప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పును, ప్రతి ఏటా అసలు, వడ్డీతో కలిపి రూ.71 వేలకోట్లు చెల్లించేలా, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల, ఇరిగేషన్ కాంట్రాక్టు, గృహనిర్మాణం, ఉపాధిహామీ బకాయిలు మొత్తం ఒక లక్షా నలభై వేల కోట్లు బకాయిలు పెట్టి రాష్ట్రం నడ్డివిరిచారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా తయారయ్యేలా చేశారని విమర్శించారు.

నేషనల్ గేమ్స్ టెక్నికల్ టైం కీపర్‌గా కృష్ణయ్య

పూతలపట్టు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో ఫిబ్రవరి 4వ తేది నుంచి 17వ తేది వరకు జరగనున్న 38వ నేషనల్ గేమ్స్‌కు పూతలపట్టు ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న పీడీ కృష్ణయ్య టైం కీపర్‌గా ఎంపికయ్యారు. ఆయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరవ కోర్టు న్యాయమూర్తిగా బాబు నాయక్

చిత్తూరు లీగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఆరవ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా బాబు నాయక్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయన కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి బదిలీపై ఇక్కడికి రానున్నారు.

జనసేన, టీడీపీ వర్గీయులపై కేసుల నమోదు

వెదురుకుప్పం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లె పంచాయతీ గంగమాంబాపురంలో మంగళవారం జరిగిన గొడవలపై కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో జనసేన నేత లోకనాథరెడ్డి, టీడీపీ యువనేత మహేష్ వర్గీయులపై కేసులు నమోదయ్యాయి. గంగమాంబాపురానికి చెందిన లోకనాథరెడ్డి సహా ఐదు గురిపై, మహేష్ సహా ఎనిమిదిమందిపై కేసు నమోదైంది. లోకనాథరెడ్డిని బుధవారం కార్వేటినగరం పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల సీజ్

నగరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని సత్రవాడ, కేవీపీఆర్‌పేట పరిధిలోని కుశస్థలీనది నుంచి ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఇసుక ట్రాక్టర్లకు అపరాధం వేసి వదిలిపెట్టినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ఇసుకను ప్రభుత్వ పనులకు, ఇల్లు కట్టుకునే వారు తీసుకెళ్లవచ్చన్నారు. ట్రాక్టర్లకు రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలించినా, డంపింగ్ చేసి పక్క రాష్ట్రాలకు తరలించాలని ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను అభినందించిన డీడీ



చిత్తూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జమ్ము కాశ్మీర్‌లో ఇటీవల జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీలో పాల్గొని స్వర్ణ పతకం సాధించిన ఐరాల సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులను ఆ శాఖ డీడీ రాజ్యలక్ష్మి అభినందించారు. వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న వంశీకృష్ణ, తొమ్మిదో తరగతి చదువున్న ప్రకాష్ స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా జట్టు నుంచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. గత డిసెంబరులో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో వంశీకృష్ణకు స్వర్ణపతకం, సబ్ జూనియర్ విభాగంలో ప్రకాష్ స్వర్ణ పతకం, ఫెన్సింగ్‌లో దినేష్ కాంస్య పతకాన్ని సాధించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను బుధవారం సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి తన కార్యాలయంలో అభినందించారు. వీరితో పాటు ఏఎస్‌డబ్ల్యూవో నాగేశ్వరరావు, వార్డెన్ సురేష్ పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే సమగ్రంగా చేపట్టండి


పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్

యాదమరి, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఆరు నెలలకొకసారి చేపడుతున్న సర్వేను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా లెప్రసీ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్, అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈనెల 20వ తేది నుంచి చేపట్టిన లెప్రసీ సర్వేకు సంబంధించిన పలు అంశాలపై వైద్యాధికారితో చర్చించారు. పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న సర్వే వివరాలను, రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, సిబ్బంది నమోదు చేసిన కేసులను వైద్యాధికారి పరీక్షించి నిర్ధారించాలని, ఏదైనా కొత్త కేసులు నమోదైతే వారికి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో యాదమరి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సురేఖ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీలను క్రమబద్ధీకరించాలి


రాష్ట్రపతికి లేఖలు రాస్తున్న అంగన్వాడీలు

వెదురుకుప్పం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలను కోర్టు తీర్పు ప్రకారం క్రమబద్ధీకరించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని బుధవారం కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు కార్వేటినగరం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు రాశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు గంగరాజు, ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి మమత, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను
జయప్రదం చేయండి

చిత్తూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6వ తేది నుంచి 8వ తేది వరకు జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమైక్య రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సమైక్య ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు యువత, నిరుద్యోగుల తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సమైక్య నాయకులు నాగరాజు, విజయ్‌కుమార్, రిషికేశవ్, సాయి, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వలేదని మొక్కలను పీకేశారు

● తలారి, వీఆర్వోలకు లంచం ఇచ్చినా పట్టా ఇవ్వలేదు
● కలెక్టరేట్ వద్ద పీకేసిన మొక్కలతో దళితుల నిరసన


పీకేసిన మొక్కలతో కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

చిత్తూరు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): లంచం ఇవ్వలేదనే కారణంతో తమ ఆధీనంలో ఉన్న భూమిలో నాటిన మొక్కలను తలారీ, వీఆర్వోలు పీకేశారని ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యంకు చెందిన నాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వో చంద్రబాబు, తలారీ చిన్నబ్బ నిర్వాకంపై బుధ వారం పీకే సిన మొక్కలతో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ 30 ఏళ్లుగా ద్రాక్షాయణి ఒక ఎకరం, వెంకటేశులు 3 ఎకరాలు, తాను ఎకరం డీకేటీ భూమిని చదును చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నామన్నారు. గతంలో తమ ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలు తీసిస్తామని చెప్పి వీఆర్వో చంద్రబాబు రెండుసార్లు రూ.80వేలు డబ్బులు తీసుకున్నాడని తెలిపారు. తలారి చిన్నబ్బకు కూడా డబ్బులు ఇచ్చామన్నారు. కొద్ది రోజుల తరువాత మళ్లీ లంచం అడిగారని, తమ వద్ద లేదని చెప్పడంతో మామిడి, టేకు, టెంకాయ మొక్కలను పీకేశారన్నారు. తహసీల్దార్, ప్రజా ప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లంచం ఇవ్వలేదనే ఒకే కారణంతో ఇలా దళితులైన తమను అధికారులు వేధిస్తున్నారన్నారు. కలెక్టర్ న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు. అనంతరం డీఆర్వో మోహన్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. పరిశీలించి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

మొగిలీశ్వరుడి ఆలయాభివృద్ధికి చర్యలు

● కలెక్టర్, ఎమ్మెల్యే


ఆలయ అభివృద్ధిపై సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కామాక్షి సమేత మొగిలీశ్వరాలయాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌తో కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, గ్రామస్తులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్ నాయుడు వీరికి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం గ్రామస్తులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయ ఆదాయ, వ్యయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాల కోసం మంచినీరు, మరుగదొడ్లు, విద్యుత్, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాల్సిందిగా సూచించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ కార్యదర్శి కోదండయాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్‌పి ధరణీ, ఉపాధ్యక్షులు కమలనాథరెడ్డి, లోకనాథనాయుడు, నాయకులు జనార్ధన్‌గౌడ్, హేమచంద్ర నాయుడు, రమేష్, హరిప్రసాద్, తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో శ్రీధర్, అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగల కోసమే వృద్ధురాలి హత్య

● ఇద్దరి అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ ప్రభాకర్, సీఐ కత్తి శ్రీనివాసులు, సిబ్బంది

బంగారుపాళ్యం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి హత్యకేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ కత్తి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ నెల 19వ తేదీన అనుమానాస్పదస్థితిలో సునందమ్మ (71) మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని చెప్పారు. కాగా సునందమ్మ కుమారుడు సంతోష్‌కుమార్ తన తల్లి మృతిపై అనుమానాలు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేపట్టారు. దీంతో సునందమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సునందమ్మ హత్య జరిగిన మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ నగర్‌లోని ఆమె ఇంటి పక్కనే నివాసం ఉంటున్న వసంతమ్మ, ఆమె కుమారుడు,కుమార్తెలను విచారించారు. పక్కా ఆధారాలు సేకరించిన పోలీసులు వసంతమ్మ కుమారుడు లీలామనోహర్(23), కుమార్తె దుర్గ(29)లను వృద్ధురాలి హత్యలో నిందితులుగా నిర్ధారించారు. వీరిని పాలేరు ఫ్లైఓవర్ వద్ద బుధవారం అదుపులోకి తీసుకుని, వారినుంచి రూ.12 లక్షల విలువ గల 176 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.

112 గ్రాముల బంగారం, కేజీ వెండి చోరీ

● సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇంట్లో పోలీస్ క్లూస్‌టీం వేలిముద్రల సేకరణ

గంగాధరనెల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు (దిగవూరు)కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భానుప్రకాష్‌రెడ్డి ఇంట్లో 112 గ్రాముల బంగారం, కేజీ వెండి చోరీ జరిగిందని ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి పేర్కొన్నారు. సోమవారం అర్ధరాత్రి భానుప్రకాష్‌రెడ్డి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. బెంగళూరు నుంచి బుధవారం వచ్చిన భానుప్రకాష్‌రెడ్డి తమ ఇంట్లో 112 గ్రాములు బంగారం, కేజీ వెండిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారని పోలీసులకు ఫిర్యాదుచేశారు. కాగా జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి క్లూస్‌టీం బుధవారం గంగాధరనెల్లూరులో భానుప్రకాష్‌రెడ్డి ఇంటిలోని అన్ని గదులను పరిశీలించి, వివిధ చోట్ల వేలిముద్రలు సేకరించారు. భానుప్రకాష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ తెలిపారు.

ఏఈలకు స్థానాల కేటాయింపు

చిత్తూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఇటీవల సబ్‌ఇంజనీర్లకు ఏఈలుగా పదోన్నతులు ఇస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి బుధవారం మండలాలను కేటాయించారు. పాలసముద్రం మండలానికి లోకేష్‌రెడ్డి, బంగారుపాళ్యంకు దేవిప్రసన్న, పైపల్లెకు తారాదేవి, భైరెడ్డిపల్లికి ప్రసాద్, పుంగనూరు టౌన్‌కు ఉమామహేశ్వర్‌లను నియమించారు.

మంగుంటలో పశు వైద్య శిబిరం

శ్రీరంగరాజపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశు ఆరోగ్య వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. బుధవారం మంగుంటలో నిర్వహించిన శిబిరంలో పశువులకు గాలి కుంటువ్యాధి టీకాలు వేసి, వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై
అవగాహన కలిగి ఉండాలి


వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

శ్రీరంగరాజపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం చిన్నతయ్యూరులో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించుకోవాలంటే ప్రకృతి వ్యవసాయంలో సేద్యం చేయాలని రైతులకు సూచించారు. మన చుట్టూ అందుబాటులో ఉన్న చెట్ల ఆకులను తీసి కషాయం, పాలు, పెరుగు, మజ్జిగ, మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. రసాయనిక పురుగు మందులు, ఎరువుల వాడకం తగ్గించి భూసారాన్ని పరిరక్షించుకోవాలని, భూమి ఆరోగ్యంగా ఉంటే మనిషి కూడా ఆరోగ్యంగా ఉంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్మద, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోకు అభినందనలు


ఇస్రో నమూనా ఆకారంలో విద్యార్థులు

బంగారుపాళ్యం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బుధవారం ఉదయం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రయోగించిన 100వ ప్రయోగం విజయవంతమైన సందర్భంగా టేకుమంద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని కలాం సైన్స్ క్లబ్ ఇస్రో బృందాన్ని అభినందిస్తూ జయహో ఇస్రో.. జయహో భారత్ అంటూనినాదాలు చేసి హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఇస్రో నమూనా ఆకారంలో విద్యార్థులు కూర్చొని శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సుభాన్, ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్, విజయకుమారి, వేణురెడ్డి, కేశవులు, జయప్రకాష్, దేవకీ, అన్నపూర్ణాదేవి, సుబ్బలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన నగరి ఏరియా వైద్యశాల


పరీక్షల కోసం క్యూ కట్టిన గర్భిణులు

నగరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చలికాలంతో పాటు దోమల బెడద అధికంగా ఉండటంతో అనారోగ్యానికి గురైన రోగులతో నగరి ఏరియా వైద్యశాల బుధవారం కిక్కిరిసింది. జ్వరాలు, దగ్గు ఇతర రోగాలతో బాధపడుతున్న వారు బుధవారం ఉదయం 10.30 గంటలకు ఓపీ కోసం బారులు తీరారు. ప్రతి బుధవారం గర్భిణులను పరీక్షిస్తుండటంతో వారు కూడా అధికసంఖ్యలో క్యూకట్టి మరీ నిలుచున్నారు. ప్రత్యేక వసతులు కల్పించకపోవడంతో వారు ఇబ్బందులు పడ్డారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

\- ఆరు మోటారు సైకిళ్ల సీజ్



దొంగతో సహా మోటారు సైకిళ్లను చూపుతున్న డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్

వెదురుకుప్పం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల దొంగను అరెస్టు చేసి, ఆరు మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ బుధవారం తెలిపారు. కార్వేటినగరం పోలీసుస్టేషన్ వద్ద కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్‌తో కలసి మీడియాకు వివరాలు తెలిపారు. కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద కార్వేటినగరం ఎస్ఐ రాజ్‌కుమార్ తమ సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో వెదురుకుప్పం మండలం బొప్పలమడుగు అలియాస్ వావిలిచేను గ్రామానికి చెందిన వై.చంద్రబాబు(34) మోటారు సైకిల్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా సిబ్బంది పట్టుకున్నారు. కార్వేటినగరం పోలీసుస్టేషన్‌కు సంబంధించి రెండు మోటారు సైకిళ్లు, ఎస్ఆర్‌పురం పోలీసుస్టేషన్‌కి సంబంధించిన మూడు మోటారు సైకిళ్లు, చంద్రబాబు ఉపయోగిస్తున్న మోటారు సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.1,25,000 ఉంటుందని తెలిపారు. మోటారు సైకిల్ దొంగను అరెస్టు చేసి, రిమాండు నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. కార్వేటినగరంలోని సిబ్బంది రాజశేఖర్, లోకనాథం, యువరాజ్, నవీన్‌కుమార్‌లకు నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ బుధవారం రివార్డులు ఇచ్చి అభినందించారు.

మాధవరం అటవీ ప్రాంతంలో
దారి దోపిడీ యత్నం


గాయ పడిన వినయ్

తవణంపల్లె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు దారిన వెళుతున్నవారి కళ్లలో కారం పొడి చల్లి దోపిడీకి యత్నించిన సంఘటన మండలంలోని రాయలపేట అటవీ మార్గంలో బుధవారం చోటుచేసుకొంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని మాధవరం బోయపల్లెకు చెందిన మహేష్‌రెడ్డి భార్య అరుణ(30) తన పుట్టిల్లు సోమల మండలం పెద్దఉప్పరపల్లె సమీపంలోని ఆకులవారిపల్లెకు పండగకు వెళ్లి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అదే గ్రామానికి చెందిన తన మేనల్లుడు వినయ్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై మాధవరం బోయపల్లెకు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మాధవరం అటవీ ప్రాంతంలోని వాటర్ ఫాల్స్ గట్టు వద్ద గుర్తు తెలియని యువకుడు వినయ్, అరుణ కళ్లల్లో కారం పొడి చల్లి దోపిడీకి యత్నించాడు. దీంతో ద్విచక్ర వాహనం నుంచి కిందపడిన వినయ్, అరుణలు గట్టిగా కేకలు వేయడంతో వెనుక ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తులు అక్కడికి చేరుకోవడంతో దుండగుడు అడవిలోకి పారిపోయాడు. ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడిన వినయ్ కాలికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అరగొండలో ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.